క్లుప్తంగా

12 మందికి కొత్త పింఛన్ల పంపిణీ



వృద్ధుడికి పింఛన్ నగదు అందిస్తున్న సర్పంచ్ వరలక్ష్మీసీతారామయ్య

పరవాడ: మండలంలో నాయుడుపాలెం గ్రామానికి చెందిన 12 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన వితంతు, వృద్ధాప్య పింఛన్లను సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య మంగళవారం పింఛన్‌దారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముత్యాలు, గ్రామ పెద్దలు కె.అప్పలనాయుడు, కె.ముత్యాలయ్య, నాయకులు యమహా నాయుడు, దొడ్డి రాజేష్, రాజాన ముత్యాలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–2 అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని రెండు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ డిప్యూటీ ప్రాజెక్టు ఇంజినీర్ బి.నిరీక్షన్ అంబేడ్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెక్షన్–2 పరిధిలోని 33/11 కేవీ, అంతకాపల్లి సబ్ స్టేషన్–11 కేవీ, గుల్లేపల్లి రూరల్ ఫీడర్లలోని మొగలిపురం, మల్లునాయుడుపాలెం గ్రామాలలో విద్యుత్ స్తంభాల పునరుద్ధరణతో పాటు విద్యుత్ లైన్లు మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

రోడ్డు మధ్య గుంతతో ఇబ్బందులు



ఊటగెడ్డ సమీపంలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

పరవాడ: పరవాడ – వాడచీపురుపల్లి రహదారిలో ఊటగెడ్డ సమీపంలో వంతెన వద్ద ఏర్పడిన గుంత ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఊటగెడ్డ వంతెన సమీపంలో ఏర్పడిన భారీ గుంత వల్ల ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిలో రాత్రి వేళ రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనచోదకులకు ఇక్కడి గుంత కనిపంచకపోవడంతో అందులో పడి గాయాలపావుతున్నారు. మరోవైపు పలుచోట్ల రోడ్డు ధ్వంసం కావడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మాంగనీసు లీజు గడువు పెంపునకు సహకరించండి



ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న సీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌కు ప్రస్తుతం ఉన్న గర్భాం మాంగనీసు లీజు గడువు పెంపునకు చర్యలు తీసుకోవాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) అధ్యక్షులు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్ కోరారు. విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణను వారు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌కు 40 ఏళ్ల క్రితం విజయనగరం జిల్లా గర్భాం గ్రామ పరిధిలో మాంగనీజు గనులు కేటాయించారన్నారు. దాని గడువు గత ఏడాది అక్టోబర్ 7వ తేదీతో ముగిసిందన్నారు. నిబంధనల ప్రకారం ఇంకో పది సంవత్సరాలు లీజు గడువు పెంపు కావాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దరఖాస్తు చేసుకుందన్నారు. దురదృష్టవశాత్తు లీజు గడువు ఫైలు మైనింగ్ మంత్రిత్వశాఖ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం పెద్దలతో మాట్లాడి లీజు గడువు పెంపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపీ స్పందించి వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ పంపినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం

అనకాపల్లి డివిజన్ ఆర్‌డీవో చిన్నికృష్ణ



మాట్లాడుతున్న అనకాపల్లి డివిజన్ ఆర్‌డీవో చిన్నికృష్ణ

సబ్బవరం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలన పూర్తి చేశామని, తప్పులు లేని పరిపూర్ణమైన ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నట్టు అనకాపల్లి డివిజన్ ఆర్‌డీవో చిన్నికృష్ణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. అక్టోబర్ 17వ తేదీ నాటికి డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తామన్నారు. అనంతరం నెల రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించి సరి చేస్తామని చెప్పారు. జనవరి 5న తుది జాబితా ప్రదర్శిస్తామన్నారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వోలు నిర్వహించిన సర్వేలో మరణించిన, ఇల్లు మారిన, డూప్లికేట్ ఓటర్లను గుర్తించామన్నారు. ఇకపై జీరో డోర్ నంబర్లు కనిపించకుండా సమగ్రంగా సర్వే నిర్వహించినట్టు వివరించారు. ఇప్పటి వరకు జనవరి 1న మాత్రమే ఓటరు నమోదు ప్రక్రియ జరిగేదని, ఇకపై జనవరి 1తో పాటు ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1న కూడా నమోదు కార్యక్రమం చేపడతామన్నారు. 17 నుంచి 18 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన యువతీ, యువకులు భావి ఓటర్లుగా నమోదు చేయించుకుంటే 18 సంవత్సరాలు నిండిన తరువాత ఆటోమేటిక్‌గా ఓటు హక్కు పొందవచ్చునన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న జగనన్న చెబుతాం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వచ్చిన ప్రతి అర్జీని వీఆర్వో స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో మొదటి దశలో 93 గ్రామాల్లో సమగ్ర రీసర్వే పూర్తి చేశామన్నారు. రెండో దశలో 123 గ్రామాలకు ఇప్పటికే 90 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. మూడో విడతలో మరో 68 గ్రామాల్లో రీసర్వే ప్రారంభిస్తున్నట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్త అమావాస్య వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న కొణతాల మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: కొత్త అమావాస్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. గవరపాలెం అమ్మవారి ఆలయ ఆవరణలో మంగళవారం నూతన పాలకవర్గం, కమిటీలతో ఆయన సమావేశమయ్యారు. వచ్చే ఏడాది మార్చి నెలలో వచ్చే కొత్త అమావాస్య జాతర, ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఇప్పటి నుంచే చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. వచ్చే నెల అక్టోబర్లో జరిగే శరన్నవరాత్రి వేడుకల్లో రోజుకో అవతారంలో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలో తొమ్మిది రోజులూ ప్రత్యేక పూజలతో పాటు, సామూహిక కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. కొత్త అమావాస్య జాతరకు 45 రోజుల ముందు మాలధారణ భక్తులు అమ్మవారి దీక్షలు బూని ఉదయం, సాయంత్రం అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దీక్షలు భూనిన భక్తులు అమ్మవారికి నిర్వహించే భారీ అంబలం పూజకు రూ.10 లక్షలు ఖర్చు చేస్తారన్నారు. అమ్మవారి మాలధారణకమిటీ సభ్యుడు ఆదిబాబు అమావాస్య యూత్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏడాది పొడవునా రూ.లక్షతో అమ్మవారి అమావాస్య పూజలో వెయ్యిమందికి అన్నప్రసాదాన్ని అందించడం అభినందనీయమన్నారు. అమ్మవారి మూలవిరాట్ దేవాలయం పునర్నిర్మాణంలో ఉందని, బాలాలయంలో భజనలు నిరాటంకంగా కొనసాగించాలని భజనమండలి సభ్యులను ఆయన కోరారు. నిర్వాహకులు పొలిమేర శ్రీను, కాండ్రేగుల సోమేష్, పాలమరశెట్టి కుమార్ మాట్లాడారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



తేగాడ ఆదర్శ పాఠశాలలో మట్టి వినాయక ప్రతిమలతో విద్యార్థులు, స్పందించే హృదయం ప్రతినిధులు

కశింకోట: పర్యావరణ హిత వినాయక చవితి ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తేగాడలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.మార్తా తిలకం కోరారు. స్పందించే హృదయం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మట్టి వినాయకుడు–పర్యావరణ పరిరక్షణ అంశంపై అవగాహన కల్పిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సుమారు 300 మంది విద్యార్థులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి వినాయక ప్రతిమలను పూజించి, జలాశయాల్లో నిమజ్జనం చేయడం వల్ల సారవంతమైన మట్టి నీటి ప్రవాహంతోపాటు కొట్టుకుపోయి పంట పొలాల్లోకి చేరుతుందన్నారు. దీంతో పంటలు బాగా పండటంతో పాటు, నీరు కలుషితం కాదన్నారు. సంస్థ సభ్యుడు కాకి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించి, మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలైన బి.రేవతి, ఎస్.హరీష్‌రాజ్, ఎ.హేమలతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.లక్ష్మి, ఉపాధ్యాయులు ఎస్.రాజేశ్వరి, ఆర్.సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం సమీప విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొని తరలించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

బహుళ పంటలతో నిత్య ఆదాయం



రైతులకు సాగు విధానం వివరిస్తున్న హేమసుందర్

సబ్బవరం : రైతులు నిరంతరం ఆదాయం ఆర్జించాలంటే పలు రకాల ఉద్యాన పంటలను ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగు చేయాలని రీజినల్ ప్రకృతి వ్యవసాయ అధికారి హేమసుందర్ సూచించారు. సబ్బవరం మండలంలో క్షేత్ర పరిశీలనలో భాగంగా ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎమ్ (ఎనీ టైమ్ మనీ) మోడల్‌లో నిరంతరం ఆదాయ మార్గంగా బహుళ పంటల సాగు విధానాన్ని రైతులకు మంగళవారం ఆయన వివరించారు. ఈ విధానంలో రైతులు 20 సెంట్ల భూమిలో 4 అడుగుల బెడ్స్ సిద్ధం చేసి జీవామృతం వేసుకోవాలని సూచించారు. పలు రకాల పంటలు బీట్‌రూట్, కేరెట్, ముల్లంగి, మొక్కజొన్న, బెండ, చిక్కుడు, వంగ, టమాటో, మిరపతోపాటు ఆకుకూరలను జీవామృతంతో శుద్ధిచేసి వేశారు. ఈ విధానంలో పలు రకాల పంటలు సాగు చేయడం ద్వారా రైతులకు నిత్యం ఆదాయం పెరగడంతోపాటు రసాయన రహిత పంటల సాగు సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పకృతి సేద్యం సిబ్బంది ఎమ్‌టీ వెంకటలక్ష్మి, మోడల్ మేకర్ జానకి, సోమలత, రైతు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సోమినాయుడుపాలెం రోడ్డు ధ్వంసం



ధ్వంసమైన సోమినాయుడుపాలెం రోడ్డు

పరవాడ: ఎన్టీపీసీ – సోమినాయుడుపాలెం మధ్య నిర్మించిన రోడ్డు 60 రోజులు గడవక ముందే ధ్వంసమవడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులతో మూలుగుతున్న ఈ రోడ్డును హిందూజా పవర్ ప్లాంటు యాజమాన్యం సౌజన్యంతో రెండు నెలల క్రితం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి బీటీ రోడ్డుగా మార్చారు. నాణ్యత లోపించిన మెటీరియల్ ఉపయోగించడం వల్లే రోడ్డు అనతి కాలంలోనే బీటలు వారిందని పలువురు ఆరోపిస్తున్నారు. రహదారిలో అధిక బరువు కలిగిన బొగ్గు లారీలు ప్రయాణించడం కూడా ఓ కారణమని భావిస్తున్నారు. భారీ వాహనాలతోపాటు కార్మికులు, ఉద్యోగులు తరచూ ప్రయాణాలు సాగిస్తున్న ఈ రహదారికి మరమ్మతులు చేపట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సోమినాయుడుపాలెం, కలపాక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వేంకటేశ్వర శతకం పుస్తకావిష్కరణ



వేంకటేశ్వర శతక పుస్తకం ఆవిష్కరిస్తున్న శిష్టా తమ్మిరాజు తదితరులు

అనకాపల్లిటౌన్: అనకాపల్లికి చెందిన ప్రముఖ కవి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శిష్టా తమ్మిరాజు రచించిన దాస తమ్మిరాజులు దండ మిదియె అను వేంకటేశ్వర స్వామివారి శతక కావ్యం అమెరికా ఫ్లోరిడా రాజధాని తలహాస్సీ నగరంలో ఈనెల 10న ఆవిష్కరించారు. ప్రముఖకవి, సంగీత దర్శకుడు శ్రీనివాస భరద్వాజ్ కిశోర్ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ శతకకర్త అద్భుతమైన చక్కని పద్యాలు రచించడమే కాకుండా ఈ నగరంలో నూతనంగా నిర్మింపబడిన వేంకటేశ్వరస్వామి వారికి అంకితమివ్వడంతో ఇక్కడ నివసిస్తున్న తెలుగువారంతా ఎంతో ఆనందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రముఖ గాయని నోరి రాధిక మాట్లాడుతూ తన చక్కని గానంతో పద్యాలు వీనులవిందుగా ఆలపించగా ప్రముఖ పండితురాలు డా.సుమన ఆ పద్యాలను సమీక్ష చేస్తూ పద్యాలు సరళంగా సుబోధకంగా ఉన్నాయని ప్రశంసించారు. పద్యకవి జానపద రవి మాట్లాడుతూ ఇది ప్రతి ఇంట భక్తి భావాన్ని కురిపించే పుస్తకమన్నారు.

సంప్రదాయ నృత్యాలకు ప్రతీక భరత నాట్యం



భరత నాట్యం చేసిన చిన్నారులతో ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: సంప్రదాయ నృత్యాలకు భరతనాట్యం ప్రతీక అని గౌరీ పంచాయతన దేవాలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసిరావు అన్నారు. శ్రావణ మాస ఆఖరి మంగళవారం సందర్భంగా ఆలయ ఆవరణలో జరిగిన 40 మంది చిన్నారులచే భారత నాట్య ప్రదర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు శాస్త్రీయ నృత్యంలో తర్ఫీదునిచ్చేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఆలయంలోని గౌరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. చిన్నారులు చేసిన భరతనాట్యం ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి కర్రి శివ సూర్యనారాయణ, సభ్యులు ఏఎల్ఆర్ నర్సింగరావు, పెంటకోట ఉమామహేశ్వరరావు, పెంటకోట బాలకృష్ణ, అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, ఆలయ సిబ్బంది ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటి దొంగే సూత్రధారి

- పింఛన్ సొమ్ము దోపిడీలో డిజిటల్ అసిస్టెంట్‌దే కీలక పాత్ర
- ఇద్దరు స్నేహితులతో కలిసి చోరీకి ప్లాన్
- బాధితుడిగా నటిస్తూ.. అంతా తానై కథ నడిపిన వైనం
- చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులు



స్వాధీనం చేసుకున్న నగదు



కేసులు ఛేదించిన పోలీస్ బృందంతో ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: గత నెల 31న నక్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు సచివాలయ ఉద్యోగులు బ్యాంక్ నుంచి పింఛను డబ్బులు డ్రా చేసి తీసుకొస్తుండగా ఇద్దరు బైక్‌పై వచ్చి దోచుకుపోయిన విషయం గుర్తుండే ఉంటుంది. తమ వద్ద ఉన్న రూ.13.78 లక్షల నగదు దొంగిలించుకుపోయారని జానకయ్యపేట సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. తొలుత నిందితులు ఇద్దరని భావించిన పోలీసులు.. వారు కాకుండా ఇంటి దొంగే ప్రధాన సూత్రధారని నిర్ధారించారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌తోపాటు సొమ్ము తీసుకువస్తున్న డిజిటల్ అసిస్టెంట్ ఆలంగి నానిబాబే అసలు దొంగని దర్యాప్తులో తేల్చారు. నానిబాబు ఎంతో పకడ్బందీగా ప్లాన్ చేసినా పోలీసులు అంతే చాకచక్యంగా ఛేదించారు. ఎస్పీ మురళీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గాజువాక ములగాడ హౌసింగ్ కాలనీకి చెందిన ఆలంగి నానిబాబు నక్కపల్లి మండలం జానకయ్యపేట సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. నానిబాబుకు సహ నిందితులు దేవిరెడ్డి సాయికుమార్, చందక సాయి చిన్ననాటి స్నేహితులు.

జల్సాలకు అలవాటు పడ్డ ఈ ముగ్గురూ ఈజీ మనీ కోసం దారి తప్పారు. పింఛన్ సొమ్ము తేవడానికి తాను కూడా వెళతానని, తన సహాయంతో సునాయాసంగా నగదు దొంగిలించవచ్చని మిత్రులతో కలిసి దోపిడీకి పథకం వేశాడు. హెటెరో కంపెనీకి వెళ్లే రూట్లో నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాన్ని ఎంచుకున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు (ఫిర్యాదుదారుడు), తాను బ్యాంకు వద్ద ఎన్ని గంటలకు బయలుదేరారు, తాము ఎంచుకున్న ప్రదేశానికి ఎంత సేపట్లో వస్తారు.. తదితర సమాచారాన్ని నానిబాబు ఎప్పటికప్పుడు సహచరులకు చేరవేశాడు. సంఘటన స్థలంలో స్పీడ్ బ్రేకర్ వద్ద పల్సర్ బైక్‌పై దేవిరెడ్డి సాయికుమార్.. కారం పట్టుకుని చందక సాయి సిద్ధంగా ఉన్నారు. స్పీడ్‌బ్రేకర్ వద్ద సచివాలయ ఉద్యోగుల బైక్ స్లో అయినప్పుడు వెల్ఫేర్ అసిస్టెంట్ కళ్లలో కారం కొట్టి డబ్బుల బ్యాగ్ లాక్కొని కోటవురట్ల వైపు స్పీడ్‌గా వెళ్లిపోయారు. తనకు ఏమీ తెలియనట్లు నానిబాబు నటించాడు. వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి విచారించారు. తొలుత ఇద్దరు సచివాలయ ఉద్యోగులను అనుమానించిన పోలీసులు వారిపై నిఘా పెట్టారు. నానిబాబు తీరు వారిని ఆలోచింపజేసింది. సీసీ కెమెరాలు లేని నిర్మానుష్య ప్రాంతాన్ని సంఘటనకు ఎంచుకున్నా.. బ్యాంకు నుంచి సంఘటన స్థలం వరకు మధ్యలో ఉన్న మొత్తం 25 సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు నిందితులను కనిపెట్టారు. సంఘటన జరగడానికి ముందు నానిబాబు స్నేహితులు బైక్‌పై రెక్కీ నిర్వహించడం, అనుమానాస్పదంగా చక్కర్లు కొట్టడం పోలీసులు గమనించారు. నానిబాబు తన ఇన్‌స్టాగామ్ ఐడీ నుంచి సాయికుమార్ ఫేక్ ఇన్‌స్టాగామ్ ఐడీకి తమ రూట్ గురించి మెసేజ్ పెట్టినట్టు కనిపెట్టారు. దీంతో నానిబాబుకు సహ నిందితులకు ఉన్న స్నేహం నిర్ధారణ అయింది. దాంతో మంగళవారం ముగ్గురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద రూ.12,92,000 నగదు, పల్సర్ బైక్, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఎస్పీ అభినందనలు

అద్భుత ప్రతిభ కనబరిచి తక్కువ వ్యవధిలో స్నాచింగ్, దోపిడీ కేసులను పరిష్కరించిన అడిషనల్ ఎస్పీ అదిరాజ్ రాణా, నర్సీపట్నం సీఐ రమణయ్య, నక్కపల్లి సీఐ అప్పన్న, బుచ్చియ్యపేట సీఐ కుమార్‌స్వామి, నాతవరం ఎస్సై పి.రామకృష్ణ, నర్సీపట్నం రూరల్ ఎస్సై ఎం.నారాయణరావు, గొలుగొండ ఎస్సై జి.నారాయణరావు, నక్కపల్లి ఎస్సై శిరీష, కోటవురట్ల ఎస్సై, కానిస్టేబుళ్లు ఆర్.రమణ, సీహెచ్ చిన గంగరాజు, ఎస్.శ్రీనులను ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (పరిపాలన) విజయభాస్కర్, అడిషనల్ ఎస్పీ (క్రైం) పి.సత్యనారాయణరావు, ఎస్‌బీ సీఐలు చంద్రశేఖర్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన భవన్‌ను సందర్శించిన ఎస్టీ కమిషన్ చైర్మన్



మ్యూజియం సందర్శిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు

కొమ్మాది: రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ భవన్‌ను మంగళవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకర్రావు సందర్శించారు. భవన్ కార్యక్రమ తీరును ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్నబాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం భవన్‌లో గల మ్యూజియం, గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఇక్కడ కార్యాలయ సిబ్బందిని చిన్నబాబు పరిచయం చేశారు.

పాము కాటుకు రైతు మృతి

రాంబిల్లి : కట్టుబోలు గ్రామానికి చెందిన రైతు పాము కాటుకు మృతి చెందాడు. మంగళవారం తెల్లవారుజామున జల్లా అప్పలనాయుడు(61) ఇంటి నుంచి మురకాడ సమీపంలో వున్న పొలంలోకి వెళ్తుండగా పాము కాటు వేసింది. యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. రైతుగా, కూలీగా, భవన నిర్మాణ కార్మికుడిగా, కళాకారుడిగా గ్రామంలో అప్పలనాయుడుకు మంచి పేరుంది. అప్పలనాయుడుడు మృతితో ఆయా కుటుంబంతో పాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ దీనబంధు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అప్పలనాయుడుకు భార్య గణేషమ్మ, కుమారులు సాయి, భాను ఉన్నారు.

కత్తితో కోడలిపై మామ దాడి

అదనపు కట్నం కోసం వేధింపులు



గాయపడిన హారిక

బీచ్‌రోడ్డు : బీచ్‌రోడ్డు : కోడలిపై మామ దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బుల్లయ్య కాలేజీ సమీపంలో నివాసముంటున్న బొట్టా అప్పారావు.. తన కుమారుడు మధుసూదనరావుకు పదేళ్ల క్రితం అనకాపల్లికి చెందిన హారికతో పెళ్లి చేశాడు. ఆ సమయంలో ఇచ్చిన లాంఛనాలు కాకుండా అదనంగా మరో రూ.2 లక్షల కట్నం అడగడంతో రెండు కుటుంబాల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ విషయంలో కుమారుడు మధుసూదనరావు కూడా భార్య కుటుంబానికి సహకరించటంతో అప్పారావు తట్టుకోలేకపోయాడు.

దీంతో కొడుకు, కోడలిని ఇబ్బంది పెట్టడం ప్రారంభించారు. మూడో అంతస్తులో నివాసం ఉంటున్న తన కుమారుడు ఇంటికి నీటి సదుపాయం నిలిపివేశాడు. దీంతో కోడలు నీటి కోసం సోమవారం దిగువ ఫ్లోర్‌కు రావడంతో చూసి సహించలేని అప్పారావు కత్తితో దాడి చేశాడు. ఆమె తప్పించుకోవడంతో భుజానికి గాయమైంది. విషయం గమనించిన చుట్టు పక్కల వాళ్లు అప్పారావును అడ్డుకొన్నారు. అనంతరం హారికను కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ అధ్యాపకుడికి సత్కారం



అధ్యాపకుడు సుబ్రహ్మణ్యేశ్వరరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

సింహాచలం: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న అధ్యాపకుడు సుబ్రహ్మణ్యేశ్వరరావును మంగళవారం ఘనంగా సన్మానించారు. లెక్చరల్ కోటాలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆయన ఇటీవల అవార్డు పొందారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో ఆయనకు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ దుశ్శాలువ కప్పి సన్మానం చేశారు. కళాశాల లెక్చరర్లు, సహచర సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.